భూ కైలాస్

శివనామస్మరణతో శైవక్షేత్రాలు శోభాయమానమయ్యాయి. పుణ్యస్నానాలతో కృష్ణాతీరాలు పులకించిపోయాయి. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని శివాలయాలు బుధవారం భక్తులతో కిటకిటలాడగా, స్నానఘాట్లు కళకళలాడాయి. అర్ధరాత్రి దాటాక ఇంద్రకీలాద్రిపై ఆదిదంపతుల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగగా, యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రభలు ప్రకాశవంతమై వెలిగాయి.



యనమలకుదురులో ప్రభల మహోత్సవం (ఇన్‌సెట్‌లో) పూజలందుకుంటున్న రామలింగేశ్వరస్వామి



- ఘనంగా మహాశివరాత్రి మహోత్సవాలు
- ఇంద్రకీలాద్రిపై ఆది దంపతుల కల్యాణ వేడుకలు
- యనమలకుదురులో వైభవంగా ప్రభల ఉత్సవం
- కిటకిటలాడిన శివాలయాలు.. కళకళలాడిన స్నానఘాట్లు

6

ఓటే శాసనం..!



నేడే కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక

ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్

- జిల్లావ్యాప్తంగా 78,063 మంది ఓటర్లు
- పోలింగ్ కేంద్రాలు 112.. ఉద్యోగులు 538 మంది
- పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు
- కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్యే పోటీ
- సార్వత్రిక ఎన్నికల స్థాయిలో ఉత్కంఠ



నగరంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో పోలింగ్ సిబ్బంది

శాసనమండలి సమరానికి సర్వంసిద్ధమైంది. జిల్లాలో ఏర్పాటుచేసిన 112 పోలింగ్ కేంద్రాల్లో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. ఎన్నికల సిబ్బందితో పాటు ఓటింగ్ సామగ్రి కూడా పోలింగ్ కేంద్రాలకు చేరుకుంది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించగా, విద్యాసంస్థలకు ఇప్పటికే సెలవు ప్రకటించారు. గురువారం ఉదయం 8 గంటలకు ప్రారంభమయ్యే పోలింగ్ సరళికి యంత్రాంగం క్షేత్రస్థాయిలో ఏర్పాట్లు పూర్తిచేసింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్ర శాసనమండలి సభ్యుడి స్థానానికి గురువారం ఎన్నికలు జరగనున్నాయి. అభ్యర్థులెందరు ఉన్నా ప్రధాన పోటీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్, పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మధ్యే సాగుతోంది. మంగళవారమే ప్రచారం పరిసమాప్తమైనా ఎన్నికల రోజు అవలంబించాల్సిన వ్యూహాలపై రెండు శిబిరాల్లోనూ సమాలోచనలు జరిగాయి. పోలింగ్ బూత్ ఏజెంట్లు, ఎన్నికల చీఫ్ ఏజెంట్లతో అంతరంగికంగా సమావేశాలు నిర్వహించారు. అమరావతి రాజధాని ప్రాంతంలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నిక కావటంతో కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. దీంతో గతంలో ఎన్నడూలేని విధంగా ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపు కోసం భారీగా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకునేందుకు ప్రజా సంఘాలు కూడా పెద్ద ఎత్తున కృషి చేశాయి. దీంతో ఈ ఎన్నికలు ఎప్పుడూ లేనంత హోరాహోరీగా మారాయి. సాధారణ ఎన్నికలను తలపించేలా నామినేషన్ల నుంచి ప్రచారం వరకు కూడా ప్రధాన అభ్యర్థులు తగ్గలేదు. దీంతో ఈసారి మిగతా 6లో..

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

సత్యవర్ధన్ బెదిరింపుల ఎపిసోడ్ పథకం ప్రకారమేనా?

నాడు వంశీ కలిసిన వైసీపీ ముఖ్య నేతలు ఎవరు?

- విచారణలో పోలీసుల ప్రశ్నలతో బలపడుతున్న అనుమానాలు
- తాడేపల్లి పెద్దల సూచనతోనే నాడు టీడీపీ ఆఫీసులపై దాడులు
- సత్యవర్ధన్‌ను తమవైపు తిప్పుకొనే ప్లాన్ కూడా వారిదే..?



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం టీడీపీ కార్యాలయంపై వైసీపీ మూకల దాడి ఘటనలో ప్రత్యక్ష సాక్షి, ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో తాడేపల్లి వైసీపీ పెద్దల పథక రచన ఉందా..? అంటే అవుననే సందేహం కలగకమానదు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ విచారణ సందర్భంగా పోలీసులు అడుగుతున్న ప్రశ్నలను పరిశీలిస్తే.. ఇదే అనుమానం కలుగుతుంది. సత్యవర్ధన్.. హైదరాబాద్‌లోని మిగతా 6లో..

శివ శివా..!

శ్రీశైల యాత్రలో విషాదం

- కృష్ణానదిలో పడి తండ్రీకొడుకులు మృతి
- మృతులు కొల్లికుళ్ల గ్రామస్థులు
- గ్రామంలో విషాదఛాయలు



గురవయ్య



వాసు

పెనుగంచిప్రోలు, ఫిబ్రవరి 26 **(ఆంధ్రజ్యోతి) :** భక్తికి లోటున్నా.. భక్తికి ఏమాత్రం లోటు లేదని మహాశివరాత్రి పర్వదినాన శ్రీశైలక్షేత్ర యాత్రకు వెళ్లిన ఆ కుటుంబానికి తీరని శోకం మిగిలింది. శ్రీశైలంలోని కృష్ణానదిలో మిగతా 6లో..



పవిత్రసంగమం వద్ద భక్తుల పుణ్య స్నానాలు



ముక్త్యాల వద్ద కృష్ణానదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శైవ క్షేత్రాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పుణ్యనదుల్లో పవిత్ర స్నానాలు ఆచరించి, ఉపవాసాలు చేసి ఆలయాలను సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు. పితృదేవతలకు పిండ ప్రదానాలు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షలాదిగా తరలి వచ్చిన భక్తులతో రహదారులు కిక్కిరిసిపోయాయి. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులు ముందస్తు భద్రతా ఏర్పాట్లు చేశారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకున్నారు. భక్తుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడిపింది.



సంగమేశ్వరుడు



హరోం హర

భక్తులతో పోటెత్తిన శైవక్షేత్రాలు

- తెల్లవారుజాము నుంచే లక్షలాదిగా భక్తుల పుణ్యస్నానాలు
- మహా శివరాత్రి నాడు శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమ ప్రదేశం
- జనసంద్రంలా పెదకళ్లేపల్లి, ముక్త్యాల, సంగమేశ్వరాలయం



ఇంద్రకీలాద్రిపై పుష్పాలతో ప్రత్యేక అలంకరణ

యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయంలో..

పెనమలూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : యనమలకుదురు మునిగిరిపై శ్రీరామలింగేశ్వరస్వామి శివరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా జరిగాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయాలు మార్మోగాయి. భక్తులు శివపార్వతులను దర్శించి తరించారు. బుధవారం ఉదయం ఆదిదంపతుల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో పదులసంఖ్యలో ఏర్పాటు చేసిన ప్రభలు విద్యుత్ కాంతులీనాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. రోజంతా భక్తులను స్వామివారి దర్శనార్థం అనుమతించారు. పెద్దఎత్తున భక్తులు స్వామివారి దర్శనార్థం తరలివచ్చారు. స్వామివారికి అర్చకులు పంచామృతాలతో తైలాభిషేకాలు, రుద్రాభిషేకాలు, మహారుద్రాభిషేకాలు, బిల్వార్చనలు నిర్వహించారు. ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ కుటుంబసభ్యులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి బిల్వార్చన, పార్వతీదేవి అమ్మవారికి కుంకుమ పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. 11గంటలకు గ్రామ మండపం వద్ద దేవస్థానప్రభకు ఎడ్లు కట్టి ఊరేగింపు పాటలో రావి వహిత 6.3లక్షలకు దక్కించుకొన్నారు. కోలాటాలు, భజనలు, కోయ నృత్యాలు, బేతాళ వేషాలు, హిరాణి నృత్యాలు, మేళతాళాలతో వైభవంగా గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఆది దంపతుల కళ్యాణం రాత్రి 2.16గంటలకు అయోధ్య శ్రీనివాసరావు, లక్ష్మీనరసమ్మ దంపతులచే కన్నుల పండువగా జరిగింది. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ, పోలీసు శాఖ భారీ ఏర్పాట్లు చేసింది.



భక్తులతో కిటకిటలాడిన దుర్గాఘాట్



శ్రీరామలింగేశ్వరస్వామి

ఇంద్రకీలాద్రి : మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం తెల్లవారుజాము నుంచే పెద్ద సంఖ్యలో తరలివచ్చిన భక్తులతో దుర్గాఘాట్ కిటకిటలాడింది. పవిత్ర కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వర స్వామిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈవో, దేవదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ చర్యలు చేపట్టారు.



పుష్పాలతో అలంకరణ

అమ్మవారి, స్వామివార్ల ఆలయాలతో పాటు ఉపాలయాలను రంగురంగుల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. దేవస్థానం ప్రాంగణం ప్రత్యేక శోభతో అలరారింది. శివనామ స్మరణతో పులకించిన ఇంద్రకీలాద్రి కృష్ణానదిలో పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు పంచామృతాలతో అభిషేక కార్యక్రమాలను చూసేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈనెల 23 నుంచి ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం మంటప పూజలు, బలిహరణలు తదితర పూజాదికాలు జరిగాయి.

సంగమేశ్వరుని సన్నిధిలో..

నందిగామ రూరల్ : దక్షిణ కాశీగా పేరుగాంచిన దాములూరు కూడలి గ్రామంలో సంగమేశ్వరస్వామి ఆలయం శివనామస్మరణతో మార్మోగింది. తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైరా సంగమంలో పుణ్య స్నానాలాచరించి స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎండను సైతం లెక్కచేయకుండా భక్తులు గంటల పాటు క్యూలైన్‌లలో వేచి ఉండి స్వామి వారిని దర్శించుకున్నారు. వైరా సంగమం వద్ద పితృదేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ పవన్‌కళ్యాణ్, ఈవో నరసింహమూర్తి, సీఐ వైవీఎల్ నాయుడు, ఎస్ఐ అభిమన్యు, ఆయా శాఖల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, విద్యార్థులు భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు.

జనసంద్రంలా ముక్త్యాల..

జగ్గయ్యపేట రూరల్ : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ముక్త్యాల గ్రామం జనసంద్రంగా మారింది. కృష్ణానదిలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు భవానీ ముక్తేశ్వర స్వామి, కోటిలింగ హరిహర క్షేత్రంలో పూజలు చేశారు. పిండ ప్రదానాలు, తర్పణాలతో పాటు కులదైవాలకు కర్మలు చేశారు. భక్తులకు కెసీపీ సిమెంట్స్, ఉమర్ ఫ్రెండ్స్ సర్కిల్ కోటిలింగాలలో అన్నదాన కార్యక్రమం నిర్వహించగా.. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ ప్రారంభించారు. పెరిగిన నీటి మట్టం.. భక్తులకు తప్పిన ఇబ్బందులు.. కృష్ణానదిలో మంగళవారం రాత్రి వరకు నీరు లేకపోవటంలో కంగారు పడిన అధికారులు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో పులిచింతల నుంచి నీటిని విడుదల చేయటంతో బుధవారం పుణ్యస్నానాలకు ఇబ్బంది లేకుండా ఘాట్‌లకు నీరు చేరింది. వాటితో పాటు జల్లు స్నానాలను ఏర్పాట్లు చేయటంతో భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకాధికారులు, ఈవోలు ప్రసాద్, సురేష్ బాబు, హరిదుర్గా నాగేశ్వరరావు, ఎంపీడీవో నితిన్, శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ అస్మతున్‌లు పాల్గొన్నారు.

● **ట్రాఫిక్ ఇబ్బందులు**

ముక్త్యాలకు భారీసంఖ్యలో వాహనాలు పోటెత్తటంతో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. భక్తులు వేలాదిగా బైకులు, వందల సంఖ్యలో కార్లు, ఆటోలు, ట్రాక్టర్‌లు, ఇతర వాహనాలలో వచ్చారు. అంచనాలకు మించి రావటంతో పార్కింగ్ చాలకభక్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పోలీసులు అయోమయానికి గురయ్యారు. విజయవాడ సీపీ రాజశేఖరబాబు ట్రాఫిక్‌లో చిక్కుకున్నారు. నందిగామ ఏసీపీ తిలక్, సీఐ వెంకటేశ్వర్లు సిబ్బంది దాదాపు గంటన్నర పాటు శ్రమించి ట్రాఫిక్ క్లియర్ చేశారు.

పుష్కరాలను తలపించిన పవిత్ర సంగమం లక్షకు పైగా భక్తుల పుణ్య స్నానాలు

ఇబ్రహీంపట్నం : ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం వద్ద శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలకు భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి భక్తులతో ఘాట్‌లు పోటెత్తాయి. సాయంత్రం 3 గంటల వరకు సుమారు లక్షకు పైగా భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. పుష్కరాలను తలపించగా.. వందలాది కార్లు, ఆటోలు వేలసంఖ్యలో మోటార్ బైక్‌లపై తరలివచ్చారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఆర్టీసీ నేరుగా పవిత్రసంగమం వరకు ప్రత్యేక బస్సులను నడిపింది. కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన ఏర్పాట్లను పర్యవేక్షించారు. పవిత్ర సంగమం వద్ద ఒంటెల సవారీ ప్రత్యేకాకర్షణగా నిలిచింది. స్నానాలు ఆచరించిన భక్తులు, పిల్లలు ఒంటెలపై సవారీ చేశారు.



కళ్యాణం.. కమనీయం..

దుర్గగుడి, పాత శివాలయంలో కళ్యాణోత్సవాలు

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి ఆలయం (పాత శివాలయం)లో బుధవారం అర్ధరాత్రి 12 గంటల సమయంలో లింగోద్భవ ఘట్టాన్ని ఘనంగా నిర్వహించారు.



గంగా, పార్వతీ, మల్లేశ్వరుల వివాహ మహోత్సవం

భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. శివుడికి పాంచాహ్నిక దీక్షతో కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. దుర్గామల్లేశ్వర దేవస్థానంలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల దివ్య లీలా కళ్యాణోత్సవ కార్యక్రమాన్ని లింగోద్భవ ఘట్టం అనంతరం నిర్వహించారు. అంతకు ముందు ఎదుర్కోల ఉత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవమూర్తులను వధూవరులుగా అలంకరించి వివాహ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. కాగా, దుర్గగుడిలో గంగా, పార్వతీ, మల్లేశ్వరుల వివాహమహోత్సవం, పాత శివాలయంలో భ్రమరాంబ, మల్లేశ్వరుడు, భద్రకాళీ సమేత వీరభద్రస్వామి కళ్యాణోత్సవాలు ఘనంగా జరిగాయి.

దుర్గామల్లేశ్వరులకు మంగళగిరి చేనేత పట్టువస్త్రాలు



ఇంద్రకీలాద్రి, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వరులకు బుధవారం మంగళగిరి శ్రీ శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి సందర్భంగా జరిగే దుర్గామల్లేశ్వర స్వామి కళ్యాణ మహోత్సవానికి శివభక్త మార్కండేయ వంశీకులు చేనేత పట్టు వస్త్రాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తుంది. దీంతో మంగళగిరిలో భక్త మార్కండేయ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేనేత మగ్గాలపై ఈ వస్త్రాలను భక్తిశ్రద్ధలతో పవిత్రంగా తయారు చేశారు. ఈ ఏడాది ప్రధాన కైంకర్యపరులుగా ఏపీ మెడికల్ సర్వీసెస్, ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, గుత్తికొండ ధనుంజయరావు చేనేత పట్టువస్త్ర నివేదన చేశారు. డిప్యూటీ ఈవో ఎం.రత్నరాజు, సహాయ కార్యనిర్వహణాధికారి జె.శ్రీనివాసరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దామర్ల వెంకట నరసింహం, గ్రంధి శివాజీ, అందే నాగప్రసాద్, చిల్లపల్లి మోహనరావు, దామర్ల రాజు పాల్గొన్నారు.

కన్నుల పండువగా స్వామి కల్యాణం



స్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న విప్ వసంత, సౌమ్య

నందిగామ, ఫిబ్రవరి 26: ఆది దంపతులు శివపార్వతుల కల్యాణం వసంత ఇంట కన్నుల పండువగా సాగింది. మంగళవారం ఐతవరం గ్రామంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ నివాసంలో మహాశివరాత్రి సందర్భంగా శివపార్వతుల కల్యాణం జరిగింది. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పూలమండపంలో ఈ కల్యాణం నిర్వహించారు. మహాదేవుడికి పంచామృత అభిషేకాలు నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, ఎమ్మెల్యేలు శ్రీరామ్ రాజగోపాల్, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా, ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్ ఉండవల్లి శ్రీదేవి, నందిగామ, మైలవరానికి చెందిన నేతలు పాల్గొన్నారు.

స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్‌కు ఏర్పాట్లు

కలెక్టర్ లక్ష్మీశ



కలెక్టరేట్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తెలిపారు. నగరంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని ఎన్నికల సామగ్రి పంపిణీ కేంద్రాన్ని బుధవారం కలెక్టర్ లక్ష్మీశ సందర్శించి పరిశీలించారు. చెక్‌లిస్ట్ ప్రకారం సామగ్రి అందుతోందో లేదో చూశారు. అనంతరం మాట్లాడుతూ 112 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఇతర ప్రిసైడింగ్ అధికారులకు పోలింగ్ మెటీరియల్‌ను పంపిణీ చేశామన్నారు. 450 మంది పోలీస్ సిబ్బందితో పాటు తక్షణ స్పందన బృందాలు అందుబాటులో ఉంటాయన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్‌క్యాస్టింగ్‌తో పాటు మైక్రో అబ్జర్వర్లు ఉంటారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, ఆర్డీవో కావూరి చైతన్య పాల్గొన్నారు.

నేడు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సెలవు

కృష్ణా-గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికల దృష్ట్యా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదేశాలతో ఈనెల 27న గురువారం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి యూవీ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

జిల్లా జైలును పరిశీలించిన తమిళ జైలర్లు

విజయవాడ, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రానికి జైలర్లు, అసిస్టెంట్ జైలర్లు విజయవాడలోని జిల్లా జైలును పరిశీలించారు. జైళ్ల శాఖలోకి నూతనంగా అడుగుపెట్టిన వారు రాయవేలూరులో శిక్షణ పొందుతున్నారు. దీని భాగంలో వివిధ రాష్ట్రాల్లో ఉన్న జైళ్లను పరిశీలించి, అక్కడ అవలంబిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలి. దీనిలో భాగంగా వారు జిల్లా జైలును బుధవారం పరిశీలించారు. వారికి జైళ్ల శాఖ గుంటూరు రేంజ్ ఐజీ డాక్టర్ ఎం.వరప్రసాద్ తరగతులు నిర్వహించారు.

శివ శివా..!

(5వ పేజీ తరువాయి)

బుధవారం పెనుగంచిప్రోలు మండలం కొల్లికుళ్ల గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు ప్రమాదవశాత్తూ కొట్టుకుపోయి మరణించారు. కొల్లికుళ్ల, వెంగనాయకునిపాలెం గ్రామానికి చెందిన సుమారు 40 మంది భక్తులు శ్రీశైలం దర్శనార్థం మంగళవారం ఇక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు. వీరిలో కొల్లికుళ్ల గ్రామానికి చెందిన పెరుగు గురవయ్య (35), పెరుగు వాసు (11) తండ్రీకొడుకులున్నారు. పుణ్య స్నానం నిమిత్తం తొలుత వాసు కృష్ణానది నీటిలో దిగి, కాలుజారి కొట్టుకుపోతుండగా, కుమారుడ్ని రక్షించేందుకు తండ్రి గురవయ్య కూడా నదిలో దిగి మృతిచెందారు. భర్త, కుమారుడి మృతితో భార్య తిరుపతమ్మ నిర్ఘాంతపోయింది. గురవయ్య-తిరుపతమ్మకు వాసు ఒక్కడే కుమారుడు. సుమారు ఐదేళ్ల కిందట వీరి పాప చనిపోయింది. దీంతో వాసును అల్లారుముద్దుగా పెంచుకుంటున్నారు. భర్త, కుమారుడ్ని పోగొట్టుకుని తిరుపతమ్మ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. కాగా, గురవయ్య, వాసు మృతదేహాలను స్వగ్రామానికి తెప్పించడం కోసం మాజీమంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం ఎంతో కృషి చేశారు. ఇద్దరి మృతదేహాలను బుధవారం మధ్యాహ్నం ప్రత్యేక వాహనంలో కొల్లికుళ్లకు తీసుకొచ్చారు. గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

తాడేపల్లి డైరెక్షన్‌లోనేనా?

(5వ పేజీ తరువాయి)

తన ఇంటి నుంచి వచ్చిన మరుసటి రోజే వంశీ తాడేపల్లి వెళ్లి వైసీపీకి చెందిన ముఖ్యనేతలు ఇద్దరిని కలిసినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై వంశీ స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. దీనిని బట్టి చూస్తే.. ఈ మొత్తం ఎపిసోడ్.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే వంశీ, ఆయన అనుయాయులు సత్యవర్ధన్‌ను బెదిరింపులకు గురిచేశారన్న అనుమానాలు కలుగుతున్నాయి. విచారణ మరింత లోతుగా జరిగే క్రమంలో ఈ అంశాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

ఊహించని రీతిలో..

వైసీపీ హయాంలో మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు నివాసం, గన్నవరం, గుడివాడ టీడీపీ కార్యాలయాలపై వరుసగా దాడులు జరిగాయి. ఇవన్నీ వేర్వేరు దాడులే అయినా.. తాడేపల్లి వైసీపీ పెద్దల డైరెక్షన్‌లోనే జరిగాయన్న విమర్శలు అప్పట్లోనే వచ్చాయి. తాజాగా గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ఫిర్యాది సత్యవర్ధన్‌ను తమ వైపునకు తిప్పుకొనే విషయంలో కూడా తాడేపల్లి పెద్దల ఒత్తిడి ఉందన్న అనుమానాలకు బలం చేకూరుతోంది. ఈ కేసులో వల్లభనేని వంశీమోహన్ ఏ71గా ఉన్నారు. ఏ71గా ఉండటం వల్ల ఇప్పటికిప్పుడు వచ్చిన నష్టమేమీ లేదని ఆంతరంగికంగా పలువురు ముఖ్యులతో వంశీ అప్పట్లో చెప్పినట్టుగా తెలుస్తోంది. ఈ వ్యాఖ్యలు చేసిన కొద్దిరోజులకే సత్యవర్ధన్ కోర్టుకు వాంగ్మూలం ఇచ్చాడు. ఇంత వేగంగా పరిణామాలు మారడం వెనుక తాడేపల్లి వైసీపీ పెద్దల ప్రోద్బలం ఉందన్న అనుమానాలు వచ్చాయి. కేసులు ఎప్పుడూ ఉండేవేనని, గన్నవరం నియోజకవర్గంలోకి వెళ్లాల్సిన సమయం ఆసన్నమైందని ఆ పార్టీ ముఖ్యనేత ఒకరు వంశీకి గట్టిగా చెప్పిన అనంతర క్రమంలోనే ఈ పరిణామాలన్నీ చోటుచేసుకున్నాయి. తొందరగా ఈ కేసు నుంచి తప్పించుకోవచ్చని భావించిన వంశీకి ఊహించని విధంగా వరుసగా కేసులు వచ్చిపడ్డాయి.

వైసీపీ పెద్దలకు షాక్

వైసీపీ హయాంలో ఐదేళ్ల పాటు వంశీ అనుయాయులు సాగించిన అరాచకాలు, మైనింగ్ అక్రమ తవ్వకాలు, భూకబ్జాలు, రెవెన్యూ రికార్డుల ట్యాంపరింగ్, బెదిరింపులపై ఇప్పుడు అనేక కేసులు నమోదవుతున్నాయి. తాజాగా వంశీ అక్రమాలపై ప్రభుత్వం సిట్ కూడా వేయటంతో అన్నింటిపై విచారణలు సాగే అవకాశముంది. ఈ హఠాత్పరిణామాలతో తాడేపల్లి పెద్దలు తలలు పట్టుకుంటున్నారు.

ఓటే శాసనం..!

(5వ పేజీ తరువాయి)

పోటీపై తీవ్ర అంచనాలు నెలకొన్నాయి.

సర్వం సన్నద్ధం

ఎన్నికల ఏర్పాట్లు పూర్తయ్యాయి. గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు జరుగుతాయి. జిల్లావ్యాప్తంగా మొత్తం 78,063 ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 45,425 మంది కాగా, మహిళలు 32,625 మంది. ఇతరులు 13 మంది ఉన్నారు. జిల్లావ్యాప్తంగా 112 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఎన్నికలు జరుగుతున్నాయి. 112 మంది పోలింగ్ ఆఫీసర్లు, 112 మంది సహాయ పోలింగ్ అధికారులు, ఇతర పోలింగ్ అధికారులు 224 మంది, రిజర్వ్‌లో 90 మంది ఉద్యోగుల చొప్పున మొత్తం 538 మంది ఉద్యోగులు విధులు నిర్వహించనున్నారు. వీరుకాకుండా 131 మంది మైక్రో అబ్జర్వర్లు అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలో విధులు నిర్వహిస్తారు. 667 మందితో పోలీసు బందోబస్తును సిద్ధం చేశారు. డీసీపీలు ఇద్దరు, ఏడీసీపీలు ఇద్దరు, ఏసీపీలు ఆరుగురు, సీఐలు 14 మంది, ఎస్ఐలు 48 మంది, ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు కలిపి 141 మంది, హోంగార్డులు 454 మంది విధులు నిర్వహిస్తున్నారు. 20 మండలాల్లో 24 ఫ్లయింగ్ స్క్వాడ్స్ పనిచేయనున్నాయి. మొత్తం 20 మండలాల వీడియో సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఎన్నికల సామగ్రి పంపిణీ

విజయవాడ, తిరువూరు, నందిగామ రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ద్వారా ఎన్నికల సామగ్రి, పోలింగ్ సిబ్బందిని పటిష్ఠ బందోబస్తు నడుమ వారికి నిర్దేశించిన పోలింగ్ బూత్‌లకు పంపించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి తరలిస్తూనే ఉన్నారు. చెక్ లిస్ట్ ప్రకారం పోలింగ్ మెటీరియల్‌ను ఎన్నికల సిబ్బందికి అందజేశారు. బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర మెటీరియల్ అంతా పోలింగ్ సిబ్బందికి అప్పగించారు. విజయవాడ రెవెన్యూ డివిజన్ కార్యాలయం నుంచి 18 రూట్లలో పోలింగ్ సిబ్బందిని నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేర్చారు. మొత్తం 450 మంది సాయుధ పోలీసు సిబ్బంది ఎస్కార్టుతో బస్సుల్లో సిబ్బందిని, మెటీరియల్‌ను తరలించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

నేడు పటమట రైతుబజారుకు సెలవు

ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారు తెరుస్తారు

పటమట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పటమట రైతుబజారు రోడ్డులోని జడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేసిన సందర్భంగా పటమట రైతుబజారుకు సెలవు ఇస్తున్నట్లు ఎస్టేట్ ఆఫీసర్ రమేష్‌బాబు తెలిపారు. ఏపీఐఐసీ కాలనీలోని రైతుబజారుకు వారాంతపు సెలవు అయినప్పటికీ వినియోగదార్ల సౌకర్యార్థం రైతుబజారు తెరుస్తామన్నారు.

టీడీపీ... సేవ చేసే పార్టీ

పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు టీ, పాలు, బిస్కెట్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



భక్తులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అంటేనే సేవా భావం ఉన్న పార్టీ అని, రాజకీయాలతో సంబంధం లేకుండా సేవా కార్యక్రమాలు నిర్వహించే ఏకైక పార్టీ అని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. బుధవారం కృష్ణలంక 21వ డివిజన్‌లోని మెట్లబజారు చివర మహా శివరాత్రి సందర్భంగా కృష్ణానదిలో పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు మాజీ కార్పొరేటర్ స్వర్గీయ గొరిపర్తి నర్సింహారావు జ్ఞాపకార్థం టీ, పాలు, బిస్కెట్లు, తాగునీరు ప్యాకెట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ మాజీ కార్పొరేటర్ గొరిపర్తి నర్సింహారావు మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఈ విధంగా ఉచితంగా పంపిణీ చేసే కార్యక్రమాన్ని గత 15 సంవత్సరాల క్రితం ప్రారంభించారన్నారు. ఆయన లేకపోయినా గొరిపర్తి నర్సింహారావు జ్ఞాపకార్థం ప్రతి ఏడాది శివరాత్రి రోజున ఈ విధంగా ఉచితంగా పాలు, బిస్కెట్లు, టీ, తాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. జనసేన, టీడీపీ, బీజేపీ కలిసి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయని గద్దె పేర్కొన్నారు. టీడీపీ నాయకుడు గొరిపర్తి నామేశ్వరరావు మాట్లాడుతూ అన్నయ్య నర్సింహారావు ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ఆయన లేకపోయినా తాను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వేములపల్లి రంగారావు, కేశనం భావన్నారాయణ, మోటేపల్లి చిన్నా, అమరావతి వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు నిమ్మల జ్యోతిక, బీజేపీ నాయకులు గాలి శ్రీదేవి, మోకా దేవ, ఒడుగు నాగరాజు, తాడువాయి సత్యనారాయణ, ఆర్.రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



నేడు జరగనున్న కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. పటమట కోనేరు బసవయ్య చౌదరి జడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లో పోలింగ్ నిర్వహణకు సిద్ధం చేస్తున్న ఎన్నికల సిబ్బంది

ఎమ్మెల్సీ ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

విజయవాడ రూరల్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం నున్న జడ్పీ హైస్కూల్లో ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు సర్వం సిద్ధమయ్యాయి. గురువారం ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం సాయంత్రం అధికారులు పోలింగ్ బూత్‌లను సిద్ధం చేశారు. హైస్కూల్లో రెండు పోలింగ్ బూత్‌లు ఉండగా మొత్తం 1046 ఓట్లు ఉన్నాయి. ఏడీసీపీ రామకృష్ణ, నున్న సీఐ కృష్ణమోహన్ బూత్‌లను పరిశీలించి బందోబస్తుపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఉదయం 8 గంటలకు పోలింగ్ ప్రారంభమై సాయంత్రం నాలుగు గంటలకు ముగుస్తుంది.

ఘనంగా గద్దె క్రాంతి జన్మదిన వేడుకలు



టీడీపీ తూర్పు కార్యాలయంలో భారీ కేక్ కట్ చేస్తున్న గద్దె క్రాంతికుమార్

పటమట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీ యువ నాయకులు గద్దె క్రాంతికుమార్ జన్మదిన వేడుకలను బుధవారం అశోక్‌నగర్‌లోని తూర్పు టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. విజయవాడ పార్లమెంట్ తెలుగు యువత నాయకుడు షేక్ నాగూర్ ఆధ్వర్యంలో 37 కిలోల భారీ కేక్‌ను గద్దె క్రాంతికుమార్ కట్ చేశారు. అనంతరం ఆయనకు గజమాలతో తెలుగుయువత నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గద్దె హేమాన్స్, పులిపాటి రాజు, పెనుగొండ శ్రీనివాస్, పటమట సతీస్‌చంద్ర, రాయవరపు అశోక్, తోట శ్రీనివాస్, షేక్ హనీఫ్, తదితరులు పాల్గొన్నారు. **కృష్ణలంక :** టీడీపీ యూత్ నాయకులు పోదూరు పవన్ కుమార్, తవ్వా ప్రకాష్ ఆధ్వర్యంలో గద్దె క్రాంతి కార్యాలయంలో ఆయనచే కేక్ కట్ చేయించి, తినిపించారు. అంతకు ముందు పోదూరు పవన్ కుమార్, తవ్వా ప్రకాష్ ఆధ్వర్యంలో సీతమ్మవారి పాదాల వద్ద పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ యూత్ నాయకులు బీరం అరవింద్, నిమ్మకూరి కృష్ణ, సంతోష్, అశోక్, పులకరం నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణం సాధ్యం

● రెండు ఇఫ్టూల విలీనం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇఫ్టూ రాష్ట్ర నేతలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో కార్మిక వర్గాన్ని కార్పొరేట్ వర్గాలకు బానిసలుగా చేసేందుకు జరుగుతున్న ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనేందుకు ఐక్యతతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణం అవసరమని ఐఎఫ్‌టీయూ (ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి. ప్రసాద్ అన్నారు. విప్లవ కార్మిక సంస్థలైన రెండు ఐఎఫ్‌టీయూ సంస్థలు ఒకే సంస్థగా విలీనం కావాలని నిర్ణయించుకుని మార్చి 2న రాజమండ్రిలో విలీన సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాజమండ్రి విలీన సభకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తేవడం ద్వారా కార్పొరేట్లకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరిస్తున్న పరిస్థితుల్లో కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు లేకుండా పోతున్నాయని విమర్శించారు. కనీస హక్కులు సాధన కోసం కార్మిక వర్గం మరింత సమరశీలంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. మార్చి 2న రాజమండ్రిలో జరిగే సభను కార్మిక వర్గం జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పొలారి, ఉపాధ్యక్షులు ఎం ఏసు, ఆర్ హరికృష్ణ, జె. వెంకటేశ్వర్లు, కార్యదర్శులు ఆర్. మోహన్, ఎం. వెంకటేశ్వర్లు, కె. రమణ తదితరులు పాల్గొన్నారు.

శంకరమఠం వద్ద భక్తులకు ప్రసాదం పంపిణీ

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి సందర్భంగా కృష్ణలంకలోని శంకరమఠం వద్ద బుధవారం ది రిటైల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు భక్తులకు ఉచితంగా ప్రసాదాన్ని పంపిణీ చేశారు. దాదాపు 5 వేల మంది భక్తులకు పండ్లు, కేసరి, పులిహోర, వాటర్‌ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం యనమలకుదురు శివాలయం వద్ద కూడా భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తడికమళ్ల వెంకట సురేష్‌బాబు, వైవీవీ సత్యనారాయణమూర్తి, తారువాయి వెంకట సత్యనారాయణ, వుద్దగిరి శేషగిరిరావు, నల్లమల్ల ప్రసాద్ పాల్గొన్నారు.



ప్రసాదం పంపిణీ చేస్తున్న ది రిటైల్ రైస్ అండ్ జనరల్ మర్చంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు



అర్ధనారీశ్వర అలంకారంలో కాళీమాత అమ్మవారు

కృష్ణలంక, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా త్రిశక్తిపీఠంలోని కాళీమాత అమ్మవారు బుధవారం అర్ధనారీశ్వర అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు వేకువజాము నుంచే అమ్మవారిని దర్శించుకొన్నారు. దేవస్థానంలో లక్ష్మీగణపతి హోమం, ఆంజనేయస్వామి హోమం, మహాకాళీ, మహాలక్ష్మీ, మహాసరస్వతీ హోమం, శ్రీదుర్గా రుద్ర హోమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి కొప్పురావూరి జగదీష్‌కుమార్, ఆధ్యాత్మిక సలహాదారు భారతుల విజయ్‌కిరణ్, సభ్యులు పాల్గొన్నారు.

శివగిరిపై శివరాత్రి సంబరాలు



దక్షిణామూర్తి విగ్రహ ప్రతిష్ఠ చేసిన నాగసాధువులు

మొగల్రాజపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మొగల్రాజపురం శివగిరి కొండపై ఉన్న శ్రీ వాగ్దేవి జ్యోతిర్లింగ క్షేత్రం శివనామ స్మరణతో మార్మోగింది. క్షేత్ర వ్యవస్థాపకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జాము నుంచే మొదలైన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తర భారతం నుంచి ప్రత్యేకంగా వచ్చిన నాగ సాధువుల చేతుల మీదుగా శివగిరిపై దక్షిణామూర్తి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఉదయం గణపతిపూజ, స్వర్ణకపిల గోపూజ, రుద్రాభిషేకం, ద్వాదశ జ్యోతిర్లింగాలకు అభిషేకాలు, రుద్రహోమం నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం హిమాలయ నాగ సాధువులచే శివలింగానికి చితా భస్మాభిషేకం, కపాల హారతి నిర్వహించారు. అనంతరం శివపార్వతుల కల్యాణం నిర్వహించారు.



గురునానక్ కాలనీలోని రామలింగేశ్వర స్వామి

గురునానక్ కాలనీలో...

భారతీనగర్: మహాశివరాత్రి సందర్భంగా గురునానక్ కాలనీలోని శివాలయంలో బుధవారం రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం 5 గంటల నుంచి 6గంటల వరకు స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. భక్తులు వేకువజాము నుంచి వచ్చి స్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామి కల్యాణమహోత్సవం జరిగింది.

లారీ ఢీకొని యువకుడు మృతి



ప్రమాదంలో మృతి చెందిన సాయికుమార్

రాణిగారితోట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కృష్ణలంక జాతీయ రహదారిపై వారధి సమీపంలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పెదకాకాని వెంగళరావు నగర్, ఎన్టీఆర్ కాలనీకి చెందిన సాయికుమార్(23) స్నేహితుడు రమేష్‌తో కలిసి యనమలకుదురులోని అమ్మమ్మ ఇంటికి ద్విచక్రవాహనంపై బుధవారం వచ్చాడు. రాత్రి 11గంటల సమయంలో తిరిగి ఇంటికి వెళ్తుండగా రాణిగారితోట విజయకృష్ణ థియేటర్ దగ్గరకి వచ్చే సరికి వెనుక నుంచి వచ్చిన లారీ ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై వెనుక కూర్చున్న సాయికుమార్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, వాహనాన్ని నడుపుతున్న రమేష్‌కు ఎటువంటి ప్రమాదం జరగలేదు. మృతుడు సాయికుమార్ గుంటూరులోని ఒక కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నట్లు రమేష్ తెలిపాడు. ప్రమాదానికి కారణమైన లారీని వారధి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, రమేష్ నుంచి వివరాలు సేకరించారు.

'కేరాఫ్ గంగిరెడ్డుల దిబ్బ' పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

గాంధీనగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): సినీ ప్రేక్షకులకు మంచి చిత్రాలకు అందించాలనే తపనతో చిత్రాలను రూపొందించే దర్శకుడు ఎస్.ఎస్.స్వామి అని పలువురు ప్రముఖులు కొనియాడారు. శ్రీలక్ష్మీ భవానీ ఫిలిమ్స్ బ్యానర్ పై రాబోతున్న 'కేరాఫ్ గంగిరెడ్డుల దిబ్బ' సినిమా పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. నగరంలోని రెడ్ బ్రిక్స్ డవలపర్స్ కార్యాలయంలో సంస్థ అధినేత పి.ఎన్.కుమార్, మెట్రోకార్స్ అధినేత జి.మహేష్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. దర్శకుడు స్వామి మాట్లాడుతూ త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుందన్నారు. ఈ కార్యక్రమంలో వేమూరి వెంకట్రావ్, బి. జై కుమార్, జి.రామ్మోహన్, నిర్మాత ఎస్.మణికంఠ పాల్గొన్నారు.



కేశినేని వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్, తదితరులు

ఘనంగా కేశినేని వెంకయ్య వర్ధంతి

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, విజయవాడలో టీడీపీని బలోపేతం చేసేందుకు టీడీపీ నగర తొలి కన్వీనర్‌గా కేశినేని వెంకయ్య పదవీ కాంక్ష లేకుండా కృషి చేశారని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. కేశినేని వెంకయ్య వర్ధంతి కార్యక్రమాన్ని గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఎంపీ కేశినేని శివనాథ్, టీడీపీ నాయకులు వెంకయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ తన తాత వెంకయ్య ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి చెన్నుపాటి గాంధీ, టీడీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్, టీడీపీ నాయకులు మాదిగాని గురునాథం, నరసింహ చౌదరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని దంపతులకు గాయాలు

విద్యాధరపురం: బైక్ ఢీకొని దంపతులకు గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం గొల్లపూడి సాయిపురం కాలనీలో ఉంటున్న రాపల రవినాయక్ బుధవారం భార్యతో కలిసి బైక్‌పై పున్నమీఘాట్‌కు బయలు దేరాడు. గొల్లపూడి ఆంధ్ర హాస్పటల్ సమీపంలోకి వచ్చేసరికి ఓ వ్యక్తి బైక్‌పై వెనుక నుంచి రవి నాయక్ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ సంఘటనలో భార్యాభర్తలు రోడ్డు మీద పడడంతో జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. భార్యను గొల్లపూడి ఆంధ్ర హాస్పటల్‌కు తీసుకువెళ్లాడు. భర్త ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 485

ప్రత్యేక డ్రోన్‌లతో దోమల నివారణ చర్యలు

సత్యనారాయణపురం, ఫిబ్రవరి 26(ఆంధ్రజ్యోతి): నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అందులో భాగంగా రెండు డ్రోన్‌లను కొనుగోలు చేసినట్టు నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తెలిపారు. రామకృష్ణాపురం బుడమేరు కాల్వలో డ్రోన్ల ద్వారా బుధవారం ఎంఎల్ అయిల్స్ స్ప్రే చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు దోమకాటు వల్ల అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు నగరపాలక సంస్థ దోమల నివారణకు 17లక్షల రూపాయలతో రెండు మలేరియా స్ప్రింగ్ డ్రోన్‌లను కొనుగోలు చేసిందన్నారు. వీటి ద్వారా నిరంతరం ఎంఎల్ అయిల్స్ స్ప్రే చేస్తూ దోమల ఉత్పత్తి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని కమిషనర్ తెలిపారు.



శివోహం

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రిని పురస్కరించుకుని వన్‌టౌన్, చిట్టినగర్, భవానీపురం, విద్యాధరపురం, తదితర ప్రాంతాల్లోని శివాలయాలు శివ నామస్మరణతో మార్మోగాయి. బుధవారం తెల్లవారు జాము నుంచే భక్తులు కృష్ణానదిలో పుణ్యస్నానాలు ఆచరించి శివాలయాలకు చేరుకుని స్వామిని దర్శించుని పూజలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఆలయ అధికారులు, నిర్వాహకులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయాల వద్ద వన్‌టౌన్, కొత్తపేట, భవానీపురం పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చిట్టినగర్‌లో...

విజయదుర్గ రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. భక్తులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు.

బుద్ధువారి దేవస్థానంలో...

వన్‌టౌన్ బ్రాహ్మణ వీధిలోని గంగాపార్వతీ సమేత వసంత మల్లికార్జున స్వామి(బుద్ధువారి) ఆలయ ఈవో సన్యాసిరావు పర్యవేక్షణలో అర్చకులు ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

విజయేశ్వరస్వామి దేవస్థానంలో...

వన్‌టౌన్ కనకదుర్గానగర్‌లోని విజయేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో వెంకటరెడ్డి భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.







పాత శివాలయంలో..

ప్రజలకు పరమేశ్వరుడి ఆశీస్సులుండాలి : ఎమ్మెల్యే బొండా ఉమా

అజిత్‌సింగ్‌నగర్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : ఆ పరమేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో జీవించాలని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు అన్నారు. శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గంలోని శివాలయాల్లో బుధవారం ఆయన కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న సమారాధన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో బొండా సుజాత, బొండా సిద్ధార్థ, బొండా రవితేజ పాల్గొన్నారు.



మహా శివలింగానికి పుష్పాభిషేకం

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరం పైభాగంలోని మహాశివలింగాన్ని పూలమాలలు, పూలతో అలంకరించారు. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు పూలాభిషేకం నిర్వహించారు. శివలింగం వద్ద దీపాలు వెలిగించారు. సాయిబాబాకు లక్ష పూలతో, ఆవుపాలతో అభిషేకాలు జరిగాయి. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.





గవర్నర్‌పేట: వంద సంవత్సరాలకు పైగా చరిత్ర ఉన్న చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో తెల్లవారు జామునుంచే పూజలు నిర్వహించారు. శంకరుడికి భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి కుటుంబ సభ్యులతో సందర్శించి పరమ శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో యడ్లపల్లి సీతారామయ్య ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ నిర్వహించారు.



సత్యనారాయణపురం : ఆలయకమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా స్వామి దర్శనానికి అవసరమైన ఏర్పాట్లు చేశారు.

ముత్యాలంపాడులో..

ముత్యాలంపాడు జీఎస్‌రాజు రోడ్డులోని పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి దేవాలయంలో ఉదయం 3గంటల నుంచి స్వామికి అభిషేకాలతో మహాశివరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. 10గంటలకు నవగ్రహాలకు ఏకవార అభిషేకం. మధ్యాహ్నం 12గంటలకు రుద్రహోమం జరిగాయి. మధ్యాహ్నం మహన్యపూర్వక ఏకాదశి రుద్రాభిషేకం చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామవార్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో...

కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి ఉదయం 3గంటల నుంచి అభిషేకాలు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామవార్ని దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు

జగద్గురు పాదుకాక్షేత్రతంలో...

సత్యనారాయణపురం శృంగేరి జగద్గురు పాదుకాక్షేత్రంలో ధర్మాధికారి చలపతిరావు ఆధ్వర్యంలో ఉదయం 8గంటలకు రుద్రహోహం, 10గంటలకు మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సాయంత్రం శారదా చంద్రమౌళీశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. లింగోద్భవ కాలంలో మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు.



ట్రాఫిక్ ఇక్కట్లు..

వన్‌టౌన్‌లోని శివాలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలి రావటంతో రథం సెంటర్ వద్ద ట్రాఫిక్ స్తంభించింది. దుర్గగుడి, విజయేశ్వరస్వామి ఆలయం, బుద్ధువారి గుడి, పాతశివాలయం, తదితర ఆలయాలకు వెళ్లే భక్తులు ట్రాఫిక్ స్తంభించటంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొందరు ఆటో డ్రైవర్లు దుర్గగుడికి వచ్చిన భక్తులను ఆటోల్లో ఎక్కించుకోవటానికి తమ ఆటోలను రోడ్డు మధ్యలో నిలపటంపై భక్తులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిట్టినగర్ విజయదుర్గా రామలింగేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు



కన్నుల పండువగా గంగాపార్వతీ సమేత వసంత మల్లేశ్వరస్వామివార్ల నగరోత్సవం

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, భద్రకాళి సమేత వీరభద్రస్వామి, గంగా పార్వతీ సమేత వసంత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను రావణ బ్రహ్మ వాహనం పై పురవీధులలో ఊరేగించారు. ఆలయం నుంచి ప్రారంభమైన నగరోత్సవం వన్‌టౌన్ బ్రాహ్మణవీధి, కెనాల్ రోడ్డు, సామారంగం చౌక్, తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. తొలుత ఈ ఊరేగింపును విజయవాడ విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తితో పాటు పలువురు ముఖ్యులు పూజాధికాలు నిర్వహించి నగరోత్సవాన్ని ప్రారంభించారు. హరహర మహదేవ, శంభోశంకర నినాదాలతో నగరోత్సవం భక్తి శ్రద్ధలతో సాగింది. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి ఏటా నగరోత్సవాన్ని అత్యంత వైభవంగా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ నగరోత్సవం డప్పు వాయిదాలు, కోలాట నృత్యాలు భూత, బేతాళ వేషధారణల మధ్య నగరోత్సవం కన్నులపండువగా జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పెదపోలు బ్రహ్మం, నడిపల్లి ప్రసాద్, కరిమల్ల జగన్, నాగాచారి, తదితరులు పాల్గొన్నారు.



నగరోత్సవంలో వివిధ రకాల వేషధారణలు

ఐక్యతతో విప్లవ కార్మికోద్యమ నిర్మాణం సాధ్యం

● రెండు ఇఫ్టూల విలీనం పోస్టర్ ఆవిష్కరణ



గవర్నర్‌పేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని కార్పొరేట్ వర్గాలకు బానిసలుగా చేసేందుకు జరుగుతున్న ప్రభుత్వ చర్యలను ఎదుర్కొనేందుకు ఐక్యతతోనే విప్లవ కార్మికోద్యమ నిర్మాణం అవసరమని ఐఎఫ్‌టీయూ(ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. విప్లవ కార్మిక సంస్థలైన రెండు ఐఎఫ్‌టీయూ సంస్థలు ఒకే సంస్థగా విలీనం కావాలని నిర్ణయించుకుని మార్చి 2న రాజ మండ్రిలో విలీనసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆ సభకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను, పరిశ్రమలను ప్రైవేటీకరిస్తున్న పరిస్థితుల్లో కార్మిక సంఘాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. కనీస హక్కులు సాధన కోసం కార్మిక వర్గం మరింత సమరశీలంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.పొలారి, ఉపాధ్యక్షులు ఎం.ఏసు, ఆర్.హరికృష్ణ, జె.వెంకటేశ్వర్లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పశ్చిమలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలు ఇవే

వన్‌టౌన్, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు 15 పోలింగ్ బూత్‌లను అధికారులు సిద్ధం చేశారు. వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ హైస్కూల్, విద్యాధరపురంలోని ఆర్టీసీ శిక్షణ కేంద్రం, కామకోటినగర్‌లోని మైలపల్లి పోలీస్ ప్రాథమిక పాఠశాలల్లోని కేంద్రాల్లో పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వన్‌టౌన్ గాంధీజీ మునిసిపల్ హైస్కూల్‌లో పెజ్జోనిపేట, కేదారేశ్వరపేట, పూర్ణానందం పేట, కొత్తపేట, మల్లికార్జునపేట పట్టభద్రులు తమ ఓటును వినియోగించుకోనున్నారు. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనుంది.

నేడు భవానీపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యాధరపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): విద్యాధరపురం, రామరాజ్యనగర్ సెక్షన్ పరిధిలోని ఊర్మిళానగర్ ఫీడర్‌కు సంబంధించిన 11 కేవీ విద్యుత్ వైర్ల మరమ్మతుల కారణంగా గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని టౌన్ ఈఈ పి.రవీంద్రబాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గురువారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు ఊర్మిళానగర్, ఏకలవ్య నగర్, నులకపేట, రెడ్డి కాలనీ, బొమ్మసాని నగర్, పోలేరమ్మ గుడివీధి, సీతారెడ్డి కాలనీ, వెటర్నరీ కాలనీ, హెచ్‌వో ఫంక్షన్ హాల్ ఏరియా, పైపు డీలర్ల యార్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందన్నారు.

రెండు బైక్‌లు ఢీ.. భార్యాభర్తలకు గాయాలు

విద్యాధరపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం ఢీకొనటంతో భార్యాభర్తలు గాయపడిన ఘటన బుధవారం జరిగింది. గొల్లపూడి సాయిపురం కాలనీలో రాపల రవినాయక్ వ్యాపారం చేసుకుంటూ కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. మహాశివరాత్రి పురస్కరించుకుని కృష్ణానదిలో స్నానం చేయటానికి బైక్‌పై భార్య జ్యోతితో కలిసి పున్నమీఘాట్‌కు బయలుదేరాడు. గొల్లపూడి ఆంధ్ర హాస్పటల్ సమీపంలోకి వచ్చేసరికి ఓ వ్యక్తి బైక్‌పై కుటుంబ సభ్యులతో వెనుక నుంచి వేగంగా వచ్చి రవి నాయక్ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్నాడు. ఈ సంఘటనలో భార్యాభర్తలు రోడ్డుపై పడిపోవడంతో జ్యోతికి తీవ్ర గాయాలయ్యాయి. రవినాయక్ స్వల గాయాలతో బయటపడ్డాడు. రవి నాయక్ స్థానికుల సహాయంతో భార్యను ఆటోలో ఆంధ్ర హాస్పటల్‌కు తీసుకువెళ్లాడు. రవి నాయక్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆటో డ్రైవర్‌పై దాడి...

చిట్టినగర్ లంబాడీపేటకు చెందిన ఓ ఆటో డ్రైవర్‌పై మరో ఆటో డ్రైవర్ దాడిపై బుధవారం భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. లంబాడీపేటలో దువ్వా గణేష్ ఆటో నడుపుతుంటాడు. అతను మంగళవారం తన బైక్ పై సితార సెంటర్ నుంచి గొల్లపూడి వైపు వెళుతున్నాడు. బైపాస్ రోడ్డు భగవతి కాటా వద్దకు వెళ్లేసరికి బాధితుడు ముందు వెళుతున్న ఓ ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయటంతో గణేష్ ఆటోను ఢీకొన్నాడు. దీంతో బాధితుడు ఎందుకు సడన్ బ్రేక్ వేశావని ప్రశ్నించగా, ఆటోడ్రైవర్ అసభ్యకరంగా దూషించి రాయితో దాడి చేశాడు. ఈ సంఘటనలో గణేష్‌కు గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తల్లీకూతుళ్ల అదృశ్యంపై ఫిర్యాదు

పాయకాపురం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి) : తన భార్య, కుమార్తె కనిపించడం లేదని ఓ వ్యక్తి బుధవారం నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వాంబేకాలనీ ప్రాంతానికి చెందిన బత్తుల జ్యోతికి అదే ప్రాంతానికి చెందిన బత్తుల రమణకు 16 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఓ కుమార్తె. అయితే ఈనెల 23న భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన భార్య, కుమార్తెతో సహా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అప్పటి నుంచి చుట్టు ప్రక్కల పాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద ఆరాతీసిన కుటుంబ సభ్యులకు వారి ఆచూకీ తెలియకపోవడంతో నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

క్రికెట్ టోర్నీలో రైల్వేపై ఎవరెస్ట్ విజయం

విజయవాడ(స్పోర్ట్స్), ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి గ్రౌండ్స్‌లో జరుగుతున్న దేవినేని వెంకటరమణ, ప్రణీత మెమోరియల్ బీ లీగ్‌లో బుధవారం ఎవరెస్ట్, రైల్వే జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన ఎవరెస్ట్ జట్టు 50ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 281పరుగులు చేసింది. జట్టులో ఎస్.కె.ఖాజా మొహిద్దీన్ 118పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేసిన రైల్వే జట్టు 38.5 ఓవర్లలో 10వికెట్లు కోల్పోయి 114పరుగులు చేసి ఓటమి పాలైంది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90,99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.485

బాడీబిల్డర్‌కు తాతయ్య అభినందన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఏలూరులో జరిగిన రాష్ట్రస్థాయి బాడీబిల్డింగ్ పోటీల్లో పట్టణానికి చెందిన షేక్ ఇబ్రహీం 75 కేజీల విభాగంలో తృతీయ స్థానం సాధించాడు. ఆయనను బుధవారం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, యువనేత శ్రీరాం చిన బాబులు అభినందించారు. జాతీయస్థాయిలోనూ రాణించాలని శుభాకాంక్షలు తెలిపారు. కోచ్ కోటి, చంద్రపాల్‌ను వారు అభినందించారు.



బాడీబిల్డర్ ఇబ్రహీంను అభినందిస్తున్న తాతయ్య

28న వికాస్‌లో క్యాంపస్ ఎంపికలు

విస్సన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): ఈనెల 28న వికాస్ పీజీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ ఔషధ సంస్థ బైలాజికల్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఎంపికలు చేపట్టనున్నట్టు కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ ఎన్.నర్సిరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023-24, 2024-25 ఎమ్మెస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ, బీ.ఫార్మసీ, ఎమ్.ఫార్మసీ తదితర కోర్సులు చేసిన వారు అర్హులన్నారు. ఇతర వివరాలకు ప్లేస్‌మెంట్ అధికారి సీ.హెచ్ సుధీర్‌రెడ్డి 9849553107, డాక్టర్ శ్రీనివాసరావు 9951432997 లను సంప్రదించాలని ఆయన ప్రకటనలో కోరారు.

ముద్దాయిలకు రిమాండ్

జి.కొండూరు, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): స్థల వివాదానికి సంబంధించి ఒకరిపై కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి ప్రయత్నించిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే ఆత్కూరుకు చెందిన బొర్రా సాంబశివరావు, అతని భార్య సత్యవతిలపై అదే గ్రామానికి చెందిన పటాపంచల సురేష్, పటాపంచల గోపి, పటాపంచల సాంబశివరావు, గంగుల బాలాజీలు మంగళవారం రాత్రి కత్తి, కర్రలతో విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ దాడిలో భార్యాభర్తలు తీవ్రంగా గాయపడ్డారు. వారు ప్రస్తుతం విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు నలుగురుపై ఐపీసీ 307 సెక్షన్ కింద కేసు నమోదు చేసి, అరెస్టు చేశారు. వారిని బుధ వారం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించి నట్టు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు.



సాంబశివరావు

శివోహం

● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు
● అన్నదానాలు చేసిన స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు

మహాశివరాత్రిని పురస్కరించుకొని శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు మహాశివుడిని దర్శించుకుని అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.



వెల్వడంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

జి.కొండూరు/ గొల్లపూడి / రెడ్డిగూడెం, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): జి.కొండూరు మండలంలోని శివలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.శివాలయంలో ఏర్పాటు చేసిన జల్లుస్నానాల వద్ద భక్తులు స్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. స్వామి కల్యాణం వైభవంగా జరిగింది. శివాలయానికి చెందినప్రభను గ్రామోత్సవం నిర్వహించారు. మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా గొల్లపూడి, సూరాయిపాలెం కృష్ణానది స్నానాల ఘాట్‌లో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) పాతూరి మురళీకృష్ణ ప్రసాద్ ఘాట్ల వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి స్వరూపరాణి, రంగారావు పాల్గొన్నారు. రెడ్డిగూడెంలోని గోవిందమాంబ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవం బుధవారం కన్నుల పండుగగా జరిగింది.

నందిగామ: శుకశ్యామలాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరి మహాదేవుడిని దర్శించుకున్నారు. కరెన్సీ నగర్‌లోని అంకమ్మ ఆలయంలో భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమ్మవారికి, స్వామివారికి పూజలు నిర్వహించారు.

తిరువూరు: పట్టణంలోని రామలింగేశ్వర, చంద్రమౌళీశ్వరస్వామి ఆలయాల్లో తెల్లవారుజాము నుంచే భక్తులు మహాశివుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని మునుకుళ్ల అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. బాలత్రిపుర సుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో స్వామి కల్యాణ వేడుకలు పురస్కరించుకుని స్వామిని రథంపై అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఆయా ఆలయాల్లో స్వామి కల్యాణం సందర్భంగా భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయం ఈవో, వీడీడీ ప్రసాద్ ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు. గుట్టపాడు, నీలాద్రి శైవక్షేత్రాలకు స్థానిక ఆర్టీసీ డిపోనుంచి ప్రత్యేకబస్సులు నడిపారు. పెద్దవరం సమీపంలోని రాయికంపాడు శివారు ఎన్ఎస్పీ మధిర బ్రాంచి కాలువ ఒడ్డున ఉన్న శివాలయం లో ప్రత్యేక పూజలు, స్వామి కల్యాణం నిర్వహించారు. జిల్లా తెలుగుయువత అధికార ప్రతినిధి మాదల హరిచరణ్, టీడీపీ నేతుల ఆలయంలో పూజల్లో పాల్గొన్నారు.



భక్తులకు అల్పాహారం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే తాతయ్య

విస్సన్న పేట: విస్సన్నపేట, కొండపర్వ తదితర గ్రామాల్లోని శైవక్షేత్రాలు బుధవారం భక్తులతో కిటకిటలాడాయి. కొండపర్వ భ్రమరాంబికా మల్లేశ్వర (మల్లయ్య) స్వామి తిరునాళ్లకు భక్తజనం పోటెత్తారు. వేలాదిగా తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ చైర్మన్ మట్టా వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు, భారీ అన్నసమారాధన నిర్వహించారు.

మైలవరంరూరల్: మండలంలోని వెల్వడంలో ప్రసిద్ధ బాలకోటేశ్వరస్వామి ఆలయానికి బుధవారం వేకువజాము నుంచే భక్తులు పోటెత్తారు. ఆలయ సమీపంలోని కోనేటిలో భక్తులు జల్లు స్నానాలు చేసి, పితృదేవతలకు పిండప్రదానాలను సమర్పించారు. ఆలయ కమిటీ, పోలీస్ శాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన క్యూ లైన్ల ద్వారా స్వామిని భక్తులు దర్శించుకున్నారు. బాలకోటేశ్వరస్వామి తిరునాళ్ల మూడ్రోజుల పాటు జరగనుండటంతో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వేలాదిమంది భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. సంతానం లేని దంపతులు తెల్లవారుజాము నుంచే కోనేటిలో స్నానాలు చేసి, తడిబట్టలతో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో నిర్వహించిన ప్రభ బండ్ల ఊరేగింపు చూపరులను ఆకర్షించాయి. రాత్రి స్వామి కల్యాణం అనంతరం భక్తులు జాగారం చేసేందుకు కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. కాశీలో జరిగే గంగా హారతి తరహాలోస్వామికి హారతిని అందించారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా మైలవరం ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

గంపలగూడెం: కొత్తపల్లి రెవెన్యూ పరిధిలో గల కట్లేరులోని గోపాలస్వామి మడుగులో భక్తులు స్నానమాచరించేందుకు ఉమా గౌరీశంకర ఆలయ అర్చకులు జె.వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో రెండు బోర్లలో పైపుల ద్వారా నీటిని సరఫరా చేయించారు. భక్తులు స్నానమాచరించి, పితృదేవతలకు పిండప్రదానాలు చేశారు. గంపలగూడెం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గంపలగూడెం శివాలయం, మేడూరు భ్రమరాంబిక సహిత రామలింగేశ్వర స్వామి, కాత్యాయణి జీవన ముక్తేశ్వర స్వామి ఆలయం, పెనుగొలను పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామిని భక్తులు దర్శించుకున్నారు.అనంతరం భక్తులకు అన్నదానాలు ఏర్పాటు చేశారు.

వత్సవాయి: లింగాలలోని గంగాపార్వతి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయం, ఇందుగుపల్లిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయం, గట్టు భీమవరంలోని శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ తొండెపు దశరథ జనార్థన్ భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. చిల్లకల్లు - వైరా రహదారిపై ట్రాఫిక్ సమస్య తెలెత్తింది. రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీ సిబ్బంది భక్తులకు మంచినీరు, అల్పాహారం అందజేశారు.

జగ్గయ్యపేట: రాజరాజేశ్వరస్వామి, పాలేటి ఒడ్డున ఉన్న మఠం శివాలయంలో అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివాలయం వీధిలోని పార్వతీ సమేత చంద్రమౌళీశ్వర స్వామి, భవానీ ముక్తేశ్వరస్వామి ఆలయాల్లో స్వామి దర్శనానికి భక్తులు క్యూ కట్టారు. చెరువుబజార్‌లోని మార్కండేయ స్వామి ,సత్యనారాయణపురంలో యోగీశ్వర స్వామి, పాత కూరగాయల మార్కెట్ వీధిలోని సిద్ధిలింగేశ్వరస్వామి దేవస్థానంలో పంచామృతాలు, పండ్లరసాలతో ప్రత్యేక అభిషేకం, మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు నిర్వహించారు. నాగలింగేశ్వరస్వామి వారి దేవస్థానంలో రుద్రహోమం నిర్వహించారు. బ్రహ్మానందస్వామి మఠంలో చండీ హోమం నిర్వహించారు. మఠం శివా లయంలో పాశుపత రుద్రహోమం నిర్వహించారు. పెద్ద శివాలయాన్ని జనసేనయువనేత సామినేని కృష్ణప్రసాద్ దర్శించుకు పూజలు చేశారు.



జి.కొండూరులో అమరలింగేశ్వరస్వామి దేవాలయానికి చెందిన ప్రభ గ్రామోత్సవం

జగ్గయ్య పేట: బలుసుపాడు గురుధామ్‌లో తాత్వికులు గెంటేల వెంకటరమణ, వసంతలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో మీనాక్షీ, సుందరేశ్వర స్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు సద్గు రు శివానందమూర్తి ప్రతిమకు అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

పెనుగంచిప్రోలు: పవిత్ర మున్నేటి ఒడ్డున వేంచేసియున్న గంగా,పార్వతి సమేత స్వయంబు శంభులింగేశ్వరస్వామి దేవస్థానంలో ఆలయ అర్చకులు రేలంకి భాస్కరశర్మ స్వామికి విశేష పూజలు నిర్వహించారు. ట్రస్టు చైర్మన్ వాసిరెడ్డి బెనర్జీ ఏర్పాట్లను పర్యవేక్షించారు. పటమట బజారు జమ్మిచెట్టు కోదండ రామాలయం వద్ద విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

జగ్గయ్య పేట: ముక్త్యాల శివరాత్రి తిరునాళ్లకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల కోసం వివిధ స్వచ్ఛంధ సంస్థలు సేవలు అందించాయి. ముక్త్యాల బస్టాండు సమీపంలో వాసవీక్లబ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అల్పాహారం, మంచినీటిని షరాబువర్తకసంఘం గౌరవాధ్యక్షుడు శ్రీరాం రామకృష్ణ అందజేశారు. జగ్గయ్యపేట సత్యసాయి సేవాసమితి వారు ముక్త్యాలలో కోటిలింగ హరిహర మహాక్షేత్రంలో వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. జగ్గయ్యపేట వాగ్దేవి మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల అధినేత్రి బుస్సా సరిత, ప్రిన్సిపాల్ సురేషల ఆధ్వర్యంలో భక్తులకు ఘాట్‌ల వద్ద క్యూ లైన్లలో సేవలు అందించారు. సామినేని కంటి ఆసుపత్రి వారు మంచినీటి ప్యాకెట్లను పంపిణీ చేశారు. జగ్గయ్యపేట సమీపంలో అగ్రహారం బ్రిడ్జి వద్ద బాలసైదా సేవాసమితి ఆధ్వర్యంలో శివరాత్రి భక్తులకు ఉచిత అన్నప్రసాదాన్ని అందజేశారు. కౌన్సిలర్, జనసేన నేత సామినేని వెంకటకృష్ణప్రసాద్ పంపిణీని ప్రారంభించారు. జిల్లా వాసవీసేవాసమితి ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీనిఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ప్రారంభించి భక్తులకు సేవలు అందించారు.



ప్లాస్టిక్ పేపర్‌ప్లేట్ల తయారీ యూనిట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

విస్సన్నపేట, ఫిబ్రవరి 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలుజేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధిని సాధించాలని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సూచించారు. పీఎమ్ఈజీపీ స్కీమ్‌లో విస్సన్నపేటలో ఏర్పాటు చేసిన షణ్ముఖ పేపర్ ప్లేట్స్ మ్యానిఫ్యాక్చర్ యూనిట్‌ను ఆయన సందర్శించారు. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని పలువురికి ఉపాధి కల్పించాలని సూచించారు.

అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లు స్వాధీనం

తిరువూరు : స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో దాడులు నిర్వహించి, అనుమతి లేని ప్రాంతంలో నిల్వ ఉంచిన మద్యం బాటిళ్లతో పాటు, తెలంగాణ మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. విస్సన్నపేట మండలం రెడ్డిగూడెం రోడ్డులో కనకదుర్గా వైన్స్ షాపులో అనుమతి లేకుండా 4500 మద్యం బాటిళ్లు నిల్వ ఉంచిన రూమ్‌ను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. విస్సన్నపేట అంబేడ్కర్ సెంటర్‌లో మద్యం అమ్ముతున్న అనుమోలు పాండు రంగరావు నుంచి 22 మద్యం, 10 బీరు బాటిళ్లు, కొండపర్వలో సాంబశివరావు నుంచి 23 మద్యం, 10 బీరు బాటిళ్లు, గంపలగూడెం మండలంలో ఉమ్మడిదేవరపల్లిలో బండికొల రమేష్ నుంచి తెలంగాణకు చెందిన 10 మద్యం బాటిళ్లు, మోపెడ్ స్వాధీనం చేసుకున్నట్టు సీఐ వివరించారు. విస్సన్నపేట మండలం తెల్లదేవరపల్లిలో మూడే మరియరాణి నుంచి 6 మద్యం బాటిళ్లు, పుట్రేలలో కొండా మారేష్ నుంచి 10 మద్యం బాటిళ్లు, గంపలగూడెంకు చెందిన కోట సురేష్ నుంచి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని, వారిపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సీఐ తన ప్రకటనలో పేర్కొన్నారు.

యథేచ్ఛగా మద్యం విక్రయాలు

నందిగామ రూరల్, : గురువారం జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా మద్యం అమ్మకాలు నిలిపివేయాలన్న ఎన్నికల సంఘం ఆదేశాలను సైతం మద్యం దుకాణాదారులు పట్టించుకోవటం లేదు. నియోజకవర్గంలోని పలు మద్యం దుకాణాలకు ఎక్సైజ్ అధికారులు సీలు వేసినప్పటికీ బుధవారం బెల్టుషాపుల ద్వారా మద్యం విక్రయాలు యథేచ్ఛగా కొనసాగాయి. ఇప్పటికైనా ఎన్నికల అధికారులు, ఎక్సైజ్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



జి.కొండూరు పోలింగ్ బూత్ వద్దకు చేర్చిన సామగ్రి



పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఆర్డీవో కె.మాధురి



విస్సన్నపేటలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం

జి.కొండూరు, ఫిబ్రవరి 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా ,గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధమయ్యాయి. మైలవరం నియోజకవర్గంలోని మైలవరం, రెడ్డిగూడెం, జి.కొండూరు, ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలను కలిపి మొత్తం 21 పోలింగ్ బూత్‌లలో మొత్తం 7,820 మంది పురుషులు, 5,666 మంది మహిళలు, నలుగురు థర్డ్ జండర్లతో కలిపి మొత్తం 13,490 మంది గ్రాడ్యుయేట్స్ వారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

ఇబ్రహీంపట్నం మండలంలో 4,495 మంది ఓటర్లకు 43 నుంచి 50 వరకు 8 బూత్‌లు జాక్రీర్ హుస్సేన్ కళాశాలలో ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు తెలిపారు. వారిలో 2,431 పురుషులు, 2,063 మహిళలు, ఒక థర్డ్‌జండర్ ఉన్నట్టు ఆయన చెప్పారు.

జి.కొండూరులో 1,738 మంది గ్రాడ్యుయేట్‌లకు గాను 51, 52 రెండు బూత్‌లను జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సీ.హెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు. పురుషులు 1,062 మంది, 675 మంది మహిళలు, ఒక థర్డ్‌జెండర్ ఉన్నట్టు ఆయన చెప్పారు.

మైలవరం మండలంలో 2,605 మంది గ్రాడ్యుయేట్స్‌కు 53 నుంచి 56 వరకు నాలుగు బూత్‌లు వీవీఆర్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ దరియా తెలిపారు. వీరిలో 1,563 పురుషులు, 1,041 మంది మహిళలు, ఒక థర్డ్ జండర్ ఉన్నట్టు తెలిపారు.

రెడ్డిగూడెం మండలంలో 1,576 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా వారికి 67, 68 జెడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు బూత్‌ల్లో ఓటింగ్‌కు ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ సుశీలాదేవి తెలిపారు. వీరిలో 1,019 మంది పురుషులు, 556 మంది మహిళలు, ఒక థర్ జెండర్ ఉన్నట్టు ఆమె తెలిపారు.

విజయవాడ రూరల్ మండలంలో 3,076 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లకు గాను 74 నుంచి 76 వరకు గొల్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 78 బూత్‌ను జక్కంపూడి జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో మొత్తం 5 బూత్‌లను ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ సుగుణ తెలిపారు. వారిలో 1,745 మంది పురుషులు, 1,331 మహిళలు ఉన్నట్టు ఆమె తెలిపారు. ఒక్కో బూత్‌కు ఒక పోలింగ్ ఆఫీసర్, ఒక అసిస్టెంట్ పోలింగ్ అధికారి, ముగ్గురు ఇతర పోలింగ్ అధికారులు విధులు నిర్వహించనున్నారు. మొత్తం 21 బూత్‌లలో 5 గురు చొప్పున 105 మంది పోలింగ్ అధికారులు ఉంటారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరగనున్నట్టు అధికారులు తెలిపారు.

విస్సన్న పేట: ఉమ్మడి కృష్ణా , గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేషన్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తహసీల్దార్ కె.లక్ష్మీకల్యాణి తెలిపారు. బుధవారం విస్సన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మూడు పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. మండలంలో 1,921 ఓట్లు ఉన్నట్టు చెప్పారు. ఎంపీడీవో చేకు చిన్నరాట్నాలు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆర్డీవో కె.మాధురి అన్నారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్‌లో డివిజన్ పరిధిలో ఎమ్మెల్సీ పోలింగ్‌కు సంబంధించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ సామగ్రి కేటాయింపును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డివిజన్ పరిధిలో 12 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. డివిజన్ పరిధిలోని తిరువూరు, విస్సన్నపేట, రెడ్డిగూడెం, ఎ.కొండూరు, గంపలగూడెం మండలాల్లో మొత్తం 9337 ఓట్లకుగాను పురుషులు 6,123 మంది, మహిళలు 3,211 మంది, మూడు ట్రాన్సు జనరల్ ఓట్లు ఉన్నాయి. స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

గంపలగూడెం: కృష్ణా,గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు తహసీల్దార్ రాజకుమారి బుధవారం తెలిపారు. ఈనెల 27న గంపలగూడెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రాడ్యుయేట్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో 1862 మంది ఓట్లు ఉండగా పురుషులు 1341, మహిళలు 521 మంది ఉన్నారన్నారు.

జగ్గయ్య పేట: ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తహసీల్దార్ మనోహర్ చెప్పారు. పట్టణంలో బాలుర ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. జగ్గయ్యపేటలో 2181మంది పురుష ఓటర్లు, 1768 మహిళా ఓటర్లు కలిపి మొత్తం 3949 మంది ఉన్నారన్నారు. పెనుగంచిప్రోలు మండలంలో 1025 మంది పురుషులు, 510 మంది మహిళా ఓటర్లు మొత్తం 1535 మంది ఉన్నారన్నారు. వత్సవాయి మండలంలో 965 మంది పురుష ఓటర్లు , 526 మంది మహిళా ఓటర్లు వెరసి 1491 మంది ఓటర్లు ఉన్నట్టు ఆయన వివరించారు. వత్సవాయి హైస్కూల్‌లో రెండు సెంటర్లు, పెనుగంచిప్రోలులో రెండు సెంటర్లు ఉన్నాయని తెలిపారు

వత్సవాయి : ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కోసం వత్సవాయిలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని అధికారులు తెలిపారు.

పెనుగంచిప్రోలు: పెనుగంచిప్రోలు కె.వి.ఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్సీ పోలింగ్ కేంద్రాలను పంచాయతీ రాజ్ ఏఈ పి.సుందరామయ్య బుధవారం పర్యవేక్షించారు. మండలంలోని 1,535 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారన్నారు.